

# చిలక మీ అదృష్టం చెప్పును

ముదిగొండ శివప్రసాద్

ఆ రోజు సాయంత్రం ఏదో పనివుండి హైదరాబాదు బస్ డిపోవద్ద నే దిగాను. బస్ డిపోలో పని ఓ అయిదు నిమిషాల లోనే ముగిసింది. తర్వాత నయాపూల్ దగ్గర ఒకరిని కలుసుకోవాలి. అదికూడా త్వరగా ముగించి అక్కడే నెంబరు వన్ బస్ ఎక్కి రెండో ఆట సినిమాకెళ్లాలని కోరిక. ఎటుతిరిగీ మొదటాట అందనే అందదు.

అప్పటికి ఆరు దాటింది.

నేను చకచకా నడవడం మొదలు పెట్టాను.

మూసీనది మీదుగా చల్లనిగాలి తిరిగింది.

దూరంగా కొత్త సాలార్ జంగ్, మ్యూజియం ప్రాంతంనుండి ఏవో బాజా మోతలు....

సెంట్రల్ లైబ్రరీ పైనుండి కొన్ని వందల పావురాలు లేచి గిరికీలు కొడు

తున్నాయి....

శరీరానికి మళ్ళీ బాగా చల్లని గాలి తగిలింది.

మనస్సెందుకో హుంషారుగా వుంది!

అప్పుడే ఓ ఫర్లాంగు నడిచాను.

సహజంగానే జనసమ్మర్దమూ, ట్రాఫిక్ రద్దీ ఈ ప్రాంతంలో తక్కువగా ఉండటం చేత నేనుకూడా కొంచెం అశ్రద్ధగా పరధ్యానంగా నడుస్తున్నాను....

"బాబూ, ఇటు ఇటు" పెద్దగా కేక విన్పడింది.

"మిమ్మల్నే - ఇటురండి" ఉలిక్కిపడి తిరిగిచూచాను.

నన్నే!!

అరే! నిజంగా నన్నే పిలుస్తున్నాడాయన!!

యాంత్రికంగా అక్కడికి వెళ్లాను.

ఆయన నావైపు నిశితంగా చూస్తున్నాడు.

నాకు కొంచెం ఆశ్చర్యమూ, కొంచెం ఉత్సుకతా కలిగాయి— ఎందుకని ఆయన నన్నే అలా చూస్తున్నాడు?

నాలో ఏదో ప్రత్యేకత అతనికి కన్పడిందా?

అయితే ఏమిటది?

మానవ సహజమైనదౌర్బల్యం నాలోనూ ఆవరించింది. ప్రతి మానవుడూ తానేదో విశిష్టవ్యక్తినని భావిస్తాడు. తానేదో అపురూపమైన సృష్టిగా తలుస్తాడు. తన్ను గూర్చి ఇతరు లేమనుకుంటున్నారో తెలుసుకోవా లనుకుంటాడు.

అయినా ఈ దోవన ఒకరో అరో నాలాగే వెళ్తూనే వున్నారుకదా....త్రోవ అసలు నిర్మానుష్యం కాదుకదా, 'అలాంటప్పుడు అతడు నన్నే ప్రత్యేకంగా పిలవడంలో ఉన్నకారణం ఏమిటి?

నే నెందువల్ల అతనిదృష్టి నాకర్షించాను?

అతనివేపు చూచాను.

అతడు నావైపు నిశితంగా చూస్తున్నాడు.

ఆ చూపు వెనుక కొంత ఆప్యాయత కూడా వుంది.

మనిషి మాంత్రికుని వలె ఓ పెద్ద కుంకుమబొట్టు పెట్టాడు. ఓ పెద్ద తలపాగా- మాసినబట్టలు- నేలపై ఓ పట్టా పరిచాడు. దానిమీద రెండు పాతపుస్తకాలు పెట్టాడు. ఆ పుస్తకాల పక్కన్నే ఓ చిన్న కొయ్యపంజరం- అందులో ఓ రామచిలక- పంజరానికి ఇవతల వరుసగా కొన్ని మడిచిన కార్డులు పేర్చబడి వున్నాయి....

"క్యాబాబూ, నయాపూల్ జారహేఁ-"

ఔనన్నట్లు తల వూపాను.

ఆ తర్వాత ఉర్దూలో ఏదో ప్రశ్నించాడు. నా కర్థంకాదని చెయ్యి ఊపాను.

"తెలుగు తెలుస్తుందా?"

"ఆఁ-"

నవ్వాడు!

మీసాలు సవరించుకొని "మీకొక ముఖ్యమైన విషయం చెప్పాలి. ఓ అయిదు నిమి




షాలు ఇటురండి"

"నాతోనేనా?"

"ఆఁ....మీకేచెప్పాలి- రండి," అని నావైపు ఆప్యాయంగా చూచాడు. నేనూ ఆశగా అతడు నాతో ఏమి చెప్పబోతాడో నని మరికొంచెం దగ్గరికిపోయి వంగాను.

"బాబూ? మీపేరు రాతో ప్రారంభ మవుతుంది."

ఔను నిజమేనన్నాను- నాపేరు రాఘ వేంద్రరావు.

"మీ రాకరితో మాట్లాడే పనిమీద నయాపూల్ పోతున్నారు."

నిజమేనని తల వూపాను.

"మీకు త్వరలో ధనలాభం వుంది, బహూశా రేపు ఫస్టుకే"

ఈ దెబ్బతో నేను చిత్తైపోయాను. ఈ వ్యక్తి సామాన్యుడు కాడు. నాకు రేపు ఫస్టుకే ఎరియర్స్ వస్తాయి- దానితోపాటు కొత్త జి. వో. ప్రకారం మరికొన్ని పైసలు కూడా ఎక్కువ ముట్టుతాయి- ఎలా తెలిసిందితనికీ భవిష్యత్తు?

ఓహో! రోడ్డుపక్క ఇంత సామాన్యంగా ఎంతటి మహాసిద్ధుడున్నాడు!

అందుకే అన్నారు మట్టిలో మాణిక్యాలుంటాయని.

ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికెరుక!

ఉప్పూ కప్పురమూ ఒకే పోలికలో వుంటుంది....కాని రుచులజాడ మాత్రం

వేరు- అందుకనే వేమన్న అన్నాడు పురుషు లందు పుణ్యపురుషులు వేరని.

ఎవరైనా, ఇంతటి భవిష్యత్తు దర్శిం చిన వ్యక్తి ఇలా రోడ్డుపక్క పడివున్నా డంటే నమ్ముతారా?

దానితో వెనుకాముందూ చూడకుండా సామాజికమైన సిగ్గూ లజ్జా వదిలిపెట్టి నిర్భ యంగా అలాగే రోడ్డుపక్కన అతనిముందు కూలబడ్డాను.

ఆ మాంత్రికుడు సంతృప్తికి సూచనగా ఒక దరహాసాన్ని విసిరాడు.

చల్లని వాన గాలి మామీది నుండి పరుగెత్తుకు పోయింది.

"బాబూ- మీ భవిష్యత్తులో కొన్ని ముఖ్యమైన విషయాలు తెలుసుకోవలసినవి ఉన్నాయి- తెలుసుకుంటే మంచిది"

"తప్పకుండా- అలాగే చెప్పండి" నా భవిష్యత్తు తెలుసుకోవాలని నా కెంతో కోరిక- అందుకే పువ్వు మీ అదృష్టం చెప్పునని వున్న పత్రికా ప్రకటన చూచి రెండు సార్లు డబ్బు పంపాను. జలంధర్ సిటీ మాంత్రిక ఉంగరము- వశీకరణ శక్తి కలది తెప్పించాను- భవిష్యత్తు ఎలా వుం టుందో తెలుసుకోవాలనే కోరికతో ఓ కొండ రాజుకు ఓనాడు రెండు చొక్కా లిచ్చి చేయి చూపించుకున్నాను....ఖర్మ కాలి వాడు పోయిం తర్వాత తెలిసింది, వాడి కిచ్చిన ఓ చొక్కా జేబులోనే డబ్బు పెట్టానని....తర్వాత ఏమనుకొని ఏం లాభం??


ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే భవిష్య ద్దర్శనంపై నాకు మక్కువ ఉన్న దని మీకు తెలిపేందుకే. ఆ మాట కొస్తే భవిష్యత్తు తెలుసుకోవాలనే కోరిక ఎవడి కుండదీ లోకంలో?? ఢిల్లీ వంటి చోట్లలో అయితే చాలా పెద్ద పెద్ద వారికి స్వంత జ్యోతిష్కులే వుంటారట!! ఆ పెద్దవాళ్ళు వాళ్ళను నెల జీతాలిచ్చి పోషిస్తారట!!

"బాబూ," మాంత్రికుని పిలుపు నన్నా ఆలోచనా వాహిని నుండి ఇవతలికి తీసుకు వచ్చింది.

"మీ భవిష్యత్తు నేను చెప్పను. ఈ చిలకే చెపుతుంది." ఓహో! పరమాద్భుతం! చిలక కంతటి మహత్తర శక్తి వుందా? ఈయనే ననుకుంటే ఈయన కన్నా గొప్పది లాగుంది ఈయన చిలుక....

చూస్తుండగానే ఆయన కొయ్య పంజరం కటకటాలు తెరిచాడు....చిలక బయటకు వచ్చింది....కొంచెం బలహీనంగా వున్న తన రెక్కలూ తోకా కొద్దిగా కది లించింది....ముక్కుతో ఆ కార్డులలో ఓ మడత కార్డును ఇవతలకి లాగింది. అంతే: ఆయన దాని ముక్కు కొక ధాన్యం గింజ ఏదో అందించాడు- వెంటనే దాన్ని పంజరం లోకి నెట్టి కటకటాలు మూశాడు.

నేను వింతపడి అలాగే చూస్తున్నా నీ తమాషా అంతా- "బాబూ దానిపై ఓ అర్ధరూపాయి పెట్టండి" మాట్లాడకుండా జేబులోనుండి ఓ అర్ధరూపాయి బిళ్ళ తీసి ఆ కార్డుపై పెట్టాను. ఆ పెద్దమనిషి ఆ



అర్ధరూపాయి బిళ్ళను తీసుకొని దానితో మూడు సార్లు కార్డును కొట్టి పక్కన పెట్టి కార్డు విప్పాడు. నా భవిష్యత్తు మొత్తమూ ఆ కార్డులో వుందన్నమాట. ఆత్రంగా నోరు తెరుచుకొని చూస్తున్నాను. మాంత్రికుడు మరోసారి మీసాలు దువ్వుకొని చిరునవ్వుతో ఆ మడత విప్పి చదివాడు. అందులో నా భవిష్యత్తు అచ్చొత్త బడి వుంది. "బ్రహ్మ నీ నుదుట వ్రాసిన వ్రాతలో మార్పు వస్తుందేమో కాని చిలక జాతకం మటుకు మారేటట్టు లేదు." అన్నట్లు మాంత్రికుడు నా వైపు చూచాడు. జాతకం చదివి వినిపించాక మటుకు నా కంతగా సంతృప్తి కలుగలేదు. కొన్ని సుఖాలు రానున్నాయనీ కొన్ని కష్టాలు కలుగనున్నాయనీ, ఉత్తర దిశగా ప్రయాణమనీ, జరిగిన వాటిని మనసులో పెట్టుకోవద్దనీ అందులో ఉంది. ఇందులో వున్న ప్రతి

అక్షరమూ నాకు వర్తించిన మాట నిజమే! కాని ఈ భూలోకంలో ఎవడికి మాత్రం ఇది వర్తించదు? ఎవడికి కొన్ని కష్టాలూ కొన్ని సుఖాలూ లేవు?? ఎవరైనా సరే గతాన్ని మరచిపోవడం కన్నా చేసే దేముంది?? అసలు భవిష్యత్తుపై ఆశతోనే కదా అంత ఉత్సాహంగా చిలక ప్రశ్న వాని ముందు కూర్చున్నాను- కాబట్టి ఈ జాతకం తప్పని చెప్పే సాహసం నాలో లేకపోయినా మనస్సును పూర్తిగా ఇది సంతృప్తి పరచలేదనే చెప్పవచ్చు....

చల్లగాలితోపాటు రెండు మూడు చినుకులు టపటప రాలాయి- నేను లేచి నిలబడి గుడ్డల కంటుకున్న దుమ్ము దులుపు కున్నాను. అసలు పని కాకుండా మధ్యలో కొంతకాల యాపన జరిగిందే అనిపించింది. చూస్తుండగానే ఒక్కసారి ముంచుకొచ్చి నట్లు వర్షం ప్రారంభమైంది. నాలు గంగ లలో నెంబరు వన్ బస్ స్టాప్ చేరాను. ఓ ఖాళీ బస్ నిలబడి వుంది. వెనుకా ముందూ చూడకుండా ముందు ఎక్కి కూర్చున్నాను. అందులో డ్రైవరూ లేడు కండక్టరూ లేడు!!


వర్షం బాగా తీవ్రతరమైంది. ఇంతలో వెనుదిరిగి చూద్దును చిలక ప్రశ్నల పెద్ద మనిషి తన పట్టా, పంజరంతో బస్సులో కెక్కుతున్నాడు. కార్డులూ, పట్టాలు సర్దు కోవడంలో కొంత ఆలస్య మైందేమో, మనిషి కొంచెం తడిశాడు. నమ్రంగావచ్చి మరో ఖాళీ సీట్లో కూర్చున్నాడు. నేనాయన వైపు చూచి ఓ చిరునవ్వు నవ్వి ముభా వంగా కూర్చున్నాను. అతడూ మెదల కుండా కూర్చున్నాడు. ఇద్దరం మాట్లాడు కోకపోవడానికి ప్రత్యేకమైన కారణం- ఇదీ- అదీ- అని చెప్పదగిం దేమీ లేక పోయినప్పటికీ, మాట్లాడుకోవలసిన అవ సరం కూడా కన్పించలేదు.

వర్షం అంత కంతకూ పెరుగుతున్నదే కాని తరగడం లేదు. విండో గ్లాసులు దింపి గువ్వలా ముడిచిపెట్టుకొని కూర్చు న్నాను. బయలుదేరిన వేళ మంచిదికాదు. లేకుంటే పని కాకపోగా ఈ బస్సులో చిక్కుపడి పోయాను. వర్షం ప్రారంభ మైతే సరి ఎక్కడి సిటీ బస్సు లక్కడ నిలిచిపోతాయి ఈ వూళ్ళో.

తాచుపాముల్లాగా సాగుతున్న వర్ష ధారలు చూస్తుండగానే కొండచిలవల్లాగా మారాయి తారురోడ్ల మీద. బస్సులోకి కూడా ఎలాగో కొంత నీటి చెమ్మ వచ్చింది. నీరు కారే గాజు తలుపులగుండా దూరాన మసక మసకగా కన్పడుతున్న ఇరానీ హోటల్ లైట్లు....ఏమీ తోచక అటూ ఇటూ చూచాను. నా లాగే చిలక ప్రశ్నల మనిషీ ముడుచుకొని కూర్చున్నాడు. ఆయన వైపు చూచి భారంగా ఓ నవ్వు నవ్వాను. ఆయనా గజగజ వణుకుతూ నవ్వాడు- ఆయనకు సమీపంగా కొంచెం సీటు చివరకు జరిగి అడిగాను.

"ఈ రూటేనా"

"ఆс...."




"ఎక్కడ దిగుతారు?"

"పద్మారావు నగర్‌లో"

"వానస లేచి వచ్చేసినట్లున్నారు?" తెలిసే అడిగిన ప్రశ్న-

"ఔనౌను"- ప్రశ్నకు తగ్గ జవాబు.

"పద్మారావు నగర్‌నుండి నయాపూల్ దాకా వచ్చారేం."

జవాబుగా ఓ చిన్న చిరునవ్వు విసిరాడు చిలక ప్రశ్నల మనిషి. బహుశా నా ప్రశ్నకు చిరునవ్వే సమాధానంకాబోలు. పద్మారావు నగర్‌లో గిరాకీ లేదేమో. లేక కాంపిటీషన్ వుందేమో- నయా పూల్ వద్ద స్థలమాహాత్మ్యం వల్ల బాగా ప్రశ్నలు వస్తాయేమో. ఏ కారణమైనా కావచ్చు. అది అంత త్వరగా చెప్పదగినది కాదని అతని ఉద్దేశంలా వున్నది, చిరునవ్వుతోనే సంతృప్తి పడమన్నాడు నన్ను.

"తమరు?" నన్ను ప్రశ్నించాడు మాంత్రికుడు.

"చిక్కడపల్లి దాకా" చెప్పాను.

"ఏం పని చేస్తుంటారు బాబూ?"

చెప్పాను.

"ఆఫీసు?" నా చేతిసంచీ వైపు చూస్తూ ప్రశ్నించాడు. దానిమీద నా పేరూ డిజిగ్నేషన్ వున్న కార్డు అమర్చాను.

"లకడీకాపూల్ రేమా, అక్కడ"

"కానాదూరం"

"ఔను. అయినా ఉద్యోగధర్మం! మీరు రాలేదూ చిలకప్రశ్నలు చెప్పేందుకు పద్మారావు నగర్‌నుండి అఫ్‌జల్‌గంజ్‌కి."

ఇది ప్రశంసో విమర్శో తెలియక కొంచెం తికమకపడ్డాడు పెద్దమనిషి. నేనే అన్నాను.

"త్వరగా వెళ్ళాల్సిన పని వుందండి.



నయాపూల్‌లో ఒకాయన్ని కలుసుకుందామని వచ్చాను. వాన వల్ల ఏదీ పడలేదు. త్రోవలో మీ ప్రశ్న దగ్గర కొంతసేపు నిలబడి పోవడంతో సమయానికి అన్ని పనులూ జరగలేదు."

పెద్దమనిషి నవ్వాడు. ఆ నవ్వులో "నీ ఆలస్యానికి నామీద అకారణంగా నేరాన్ని నెట్టకు" అన్న హెచ్చరిక కన్పించింది.

"నీ స్వార్థంకోసమే నీవు నిలబడ్డావు, జాతకంముందు," అన్న భావం గోచరించింది.

చిలక వైపు చూచాను. అది ముడుచుకొని పడుకున్నది. చిలకంటే నాకెప్పుడూ రామదాసు, గోల్కొండకోట గుర్తుకొస్తాయి. చిలక నొకసారి బంధించిన నేరానికి రామదాసుకు జైలుశిక్ష ప్రాప్తించిందని కథ-

మరి ఈ మాంత్రికుని మాటేమిటి?

వాన అలా నిలబడి కురుస్తున్నది.

తొమ్మిదిగంటలు కనుక దాటితే ఈబస్సు అలో చాలామటుకు డిపోచేరుతాయి- అప్పుడిక ఏ నడకో తప్ప గత్యంతరం ఉండదేమో....ఏమిరా భగవంతుడా అనుకుంటున్నాను- చిలక ప్రశ్నల పెద్దమనిషి ముఖంలో కూడా ఇదే ఆదుర్దా కన్పించింది.

"మీరు త్వరగా ఇంటి కెళ్ళాలా?" ప్రశ్నించాను.

"అవును బాబూ! మావాళ్ళు జల్దీ రమ్మన్నారు.... నేను పోయి నూకలు తేవాలి- తర్వాత ఇవ్వాళ ఎంగిలిపడాలి."

అతని పేదతనానికి నాకు కొంత బాధ వేసింది. వర్షంవల్ల సినిమా టిక్కెట్టు దొరకలేదని కొందరికి వేదనైతే, కూటికి నూకలు లేవని మరికొందరి రోదన.

ఏమిజగత్తు! ఏమిచిత్రం!!

పాపం ఇతనింత దరిద్రంలో వున్నాడేమీ? ఇతని జాతకం చిలక ఏ మి చెప్పిందో?? ఏమిచేస్తే డబ్బు వస్తుందని అతనికా కీరవాణి విన్పించిందో తెలుసుకుంటే బాగుండును, అనిపించింది. కాని అ డి గి తే ఏమనుకుంటాడో నని ఊరుకున్నాను.

ఇదేదో బంగాళాఖాతంలోని వాయుగుండం వల్ల అకాలంలో వచ్చిన ముసురులాగుంది- అలాగే జల్లు పడుతున్నది.

డ్రైవరూ కండక్టరూ పత్తాలేదు.

అసలిది నడుస్తుందా నడవదా?? ఇలా అనుమానంతో సతమతమవుతూ వుండగా ఆ పెద్దమనిషి ప్రశ్నించాడు.

"బాబూ,ఈ బస్సు ఎప్పుడు పోతుంది?"

నేనేమీ బదులు పలుకలేక పోయాను.

"అసలు ఈరాత్రి కింక ఆపేసి డిపోకే మళ్ళిస్తారా?" మళ్ళీ ఆత్రంగాప్రశ్నించాడు. నాకు తళుక్కుమని ఓ ఊ హ తట్టింది. "చూడండి. మీ చిలకను వదలండి కార్డుల మీదికి- నే నిచ్చానే మీకు అర్థరూపాయి- దాన్ని మీరే కార్డులమీద పెట్టి ప్రశ్నించండి. ఏమి జవాబు వస్తుందో చూద్దాము- నాకూ తొందరగానే వుంది వెళ్లాలని ..."

ఈ మాటలతో ఆ పెద్దమనిషి కొంచెం కొయ్యబారి పోయినట్లు కన్పించాడు. నేనతన్ని అవమానపరచడానికి ఇలా అన్నట్లు అతను భావించుకున్నాడని నాడు అనిపింపించింది ...కొంచెం సేపాగి అన్నాడు.

"ఈ చిలక నా ప్రశ్నలూ నాకు డబ్బు వచ్చే జాతకమూ చెప్పేటట్లయితే ఇంత గర్భదరిద్రంలో కుమిలిపోతూ మీ అందరికీ దండాలు పెడుతూ ఈ వృత్తి అవలంబింపకనే పోయి వుందును .... కూటికోసం కోటివిద్యలు....మరీ అట్లా అవమానించకండి నన్ను- ఎవడివిద్య వాడిది."

"అహహా! అపార్థం చేసుకోకండి- నా ఉద్దేశం అసలేమిటంటే ... ..."

నేను చెప్పేదేమిటో వినిపించుకో వలసిన అవసరమేమీ లేదన్నట్లు ఆ పెద్దమనిషి తన చిలక పంజరంతో సహా బస్సు దిగి అలా జల్లులోనే పడి నడిచిపోతుంటే నేను నిలువునా కొయ్యబారి పోయాను.